ప్రజాశక్తి
సోమవారం 23 అక్టోబర్ 2023
5
పార్వతీపురం మన్యం

'అరచేతిలో బువ్వ పువ్వు' పుస్తకానికి పురస్కారం

పార్వతీపురం రూరల్ : పార్వతీపురానికి చెందిన ప్రముఖ రచయిత చింత అప్పలనాయుడు రచించిన అరచేతిలో బువ్వ పువ్వు పుస్తకం గుంటూరుకు చెందిన ఆచార్య ఎన్జీరంగా ఫౌండేషన్ వారు నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుచుకుంది. రంగా జయంతోత్సవ వేడుకల సందర్భంగా ఎంపిక చేసిన కవితా సంపుటలో అప్పలనాయుడు కవితా సంపుటికి ద్వితీయ బహుమతి లభించినట్లు ఆ సంస్థ అధ్యక్షులు జక్కంపూడి సీతారామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నవంబరు 7న గుంటూరులో జరిగే ఆచార్య రంగా జయంతి ఉత్సవ వేడుకల్లో ఈ బహుమతి ప్రధానం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రచయిత అప్పలనాయుడును పట్టణానికి చెందిన ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు, పక్కి రవీంద్రనాథ్, సిరికి స్వామినాయుడు, పాలకొల్లు రామలింగేశ్వరస్వామి, మల్లిపురం జగదీష్‌లతో పాటు పలువురు కవులు, కళాకారులు అభినందనలు తెలియజేశారు.

చినుకు పడక... చింత తీరక

- వర్షాభావంతో ఎండుతున్న పంటలు
- అభివృద్ధికి నోచుకోని జంఝావతి కాలువ
- ఆందోళనలో రైతన్నలు

కురుపాంలో ఎండిపోయిన వరి పంట

తుప్పలు డొంకలతో దర్శనిమిస్తున్న జంఝావతి కాలువ

ప్రజాశక్తి - కురుపాం/సీతానగరం

ఖరీఫ్ కనుమరుగవుతుంది. వర్షాలు పడాల్సిన సమయంలో ఎండలు మండిపోతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో వ్యవసాయం పరిస్థితి అయోమయంగా మారింది. మండలమంతా ఎక్కువగా మెట్టు ప్రాంతం కావడంతో వర్షాధారమే పంటలకు ఆధారం. అధిక ఎండల వల్ల పంట పొలాలకు సకాలంలో వర్షాలు పడకపోవడంతో పొలాలకు తడులుపెట్టలేని పరిస్థితిలో పైరు ఎండిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తుఫానుల కారణంగా పడిన వర్షం తప్ప కాలానుగుణంగా సరైన వర్షాలు ఈ ఏడాది పడలేదనిరైతులు నిరాశ చెందుతున్నారు. వరి పైరు పొట్ట దశలో ఉండగా తగినంత నీరు లేక పోవడం వల్ల వరి కంకుల్లో తాలు గింజలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, సరైన ఎదుగుదల లేక దిగుబడి రావడం కష్టంగా ఉందని వాపోతున్నారు. రైతులు వేలకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి ఎరువులు, పురుగు మందులు వాడి పంట చేతికి వచ్చే సమయంలో సరైన దిగుబడి రాక, తెచ్చిన అప్పులు తీర్చలేమని భయాందోళనకు గురవుతున్నారు. మండలంలో 10, 517 ఎకరాల్లో వరి పంట రైతులు సాగవుతోంది. మండలంలో ప్రధానంగా గెడ్డల ఆధారంగా పంటలు సాగవుతున్నాయి. ప్రస్తుతం ఇవి పూర్తిగా ఎండిపోవడంతో పంటలకు సాగునీరందడంలేదు. వీటిలో కిచ్చాడ, పూతికవలస, కురుపాం పరిధిలోని 816 ఎకరాల్లో బోరుబావు ఆధారంగా వరి సాగవుతుంది. మిగతా గిరిజన గ్రామాలన్నీ వర్షాధారం, గెడ్డలపై ఆధారపడే పంటలు సాగవుతున్నాయి. ప్రస్తుత వర్షాభావం నెలకొనడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయి. దీంతో వేలాది రూపాయలు మదుపులు పెట్టిన రైతన్న దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించిన మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సీతానగరం : పొట్టదశలో నీరందక వరి పంట పూర్తిగా ఎండిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో వర్షాభావం వల్ల వరి పైరు ఎండిపోతుండడంతో రైతు కంటితడి పెడుతున్నాడు. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్లో 15980 ఎకరాల్లో వరి సాగవుతుంది. అందులో 1200 ఎకరాలు ఎద కాగా, మిగిలినంది అంతా కాలువలు, వర్షాధారంపైనే ఆధారపడి సాగువుతుంది. వెంగళరాయ సాగర్ అదనపు జలాలపై ఆధారపడి 120 ఎకరాలు సాగవుతోంది. అక్కడి నుంచి నీరు సకాలంలో అందక కోటసీతారాంపురం, వెన్నెలబుచ్చెంపేట, గాదెలవలస, జానుముల్లువలస గ్రామాల్లో వరి పైరు పూర్తిగా ఎండిపోయింది. ఈ గ్రామాల సమీప చెరువుల్లో ఉన్న నీటిని మోటార్లు పెట్టి తోడించడంతో చెరువులు కూడా అడుగంటిపోయాయి. జంఝావతి ఎగువ కాలువ నుంచి 3వేల ఎకరాల వరకు సాగునీరు అందాల్సి ఉన్నప్పటికీ నీరు రాకపోవడంతో ఇప్పటికే అప్పయ్యపేట, నిడగల్లు, పాపంవలస, ఇప్పలవలస గ్రామాల్లో వందలాది ఎకరాలు వరి ఎండిపోతుంది. సీతానగరం ఆయకట్టు పరిధిలో కాజీపేట రెవెన్యూలో పొలాలు బీట్లు పడుతున్నాయి. ఇటీవల వ్యవసాయ అధికారి అవినాష్, తహశీల్దార్ ఎంవి రమణ ఆధ్వర్యంలో మండలంలో ఆరు గ్రామాల్లో తిరిగి 65 ఎకరాల వరి దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. 340 ఎకరాల్లో తేమశాతం తక్కువ ఉందని వాతావరణ ఇలా ఉంటే వారం రోజుల్లో మరో 150 ఎకరాలలో వరి ఎండిపోయే ప్రమాదం ఉందని అంచనా వేశారు. ఏది ఏమైనా సకాలంలో వర్షాల్లేక, అందుబాటులో ఉన్న సాగునీటి వనరులకు పాలకులు అందించకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు

ఈ సంవత్సరం మూడెకరాల్లో వరి సాగు చేశాను. ఇప్పటి వరకు ఎరువులు, ఇతర పనుల నిమిత్తం రూ.60 వేల వరకు ఖర్చు పెట్టా. వర్షాలు కురవపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి ప్రతిసారి నష్టాలకు గురవుతున్నా ఈసారి పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందో లేదో కూడా తెలియని పరిస్థితి. అప్పులు తీరే పరిస్థితి కనిపించడం లేదు.

ఆరిక దాసు ,
గిరిజన రైతు, పెద్ద గొత్తిలి, కురుపాం మండలం.

జంఝావతి కాలువ పనులు చేపట్టాలి

వర్షాభావం వల్ల నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. జంఝావతి కాలువ పక్కనే ఉన్నా పాలకులు, అధికారులు పనులు పూర్తి చేయకపోవడంతో మా గ్రామంలో సుమారు వందెకరాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతింది. పంట మదుపులకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ పనులు పూర్తి చేసి సాగునీరందించాలి.

కె.శ్రీనివాసరావు,
రైతు, ఇప్పలవలస, సీతానగరం మండలం.

కరువు మండలంగా ప్రకటించాలి

మండలంలో ఎక్కువ మంది గిరిజన రైతులే. వీరంతా వర్షాలపైనే ఆధారపడి వరి సాగు చేస్తున్నారు. అయితే వరిసాగుకు ఇంతవరకు పెట్టుబడులు పెట్టిన రైతులు అప్పుల పాలయ్యారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. కావున ప్రభుత్వం స్పందించి కరువు మండలంగా ప్రకటించి గిరిజన రైతులను ఆదుకోవాలి.

ఎం. శ్రీనివాసరావు,
గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి.

దేనికైనా రెడీ

- ఎమ్‌పికైనా, ఎమ్మెల్యేకైనా పోటీకి సిద్ధమే
- అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం
- డిప్యూటీ సిఎం, జిసిసి చైర్‌పర్సన్ ద్విముఖ వ్యూహం

ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఎన్నికలు అధికారపార్టీకి ఎంత కీలకమో ఆ పార్టీలో ఉన్న ముఖ్యనాయకులకూ అంతే కీలకం కానున్నాయి. ప్రధానంగా పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల నేతల భవిష్యత్తును దిశానిర్దేశం చేయనున్నాయి. డిప్యూటీ సిఎం రాజన్నదొర మన్యం జిల్లాలో సీనియర్ గిరిజన నాయకులు, ఎమ్మెల్యే కూడా. రాబోయే ఎన్నికల్లో ఆయన ఐదోసారి ఎన్నికల సమరాన్ని ఎదుర్కొనున్నారు. 2004ఎన్నికల్లో మొదటి సారి ఆయన ఓటమి చవిచూశారు. తర్వాత 2006లో కోర్టు తీర్పు ద్వారా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి జరిగిన మూడు వరుస ఎన్నికల్లో విజయపరంపర కొనసాగిస్తున్నారు. అయితే 2024 ఎన్నికల్లో ఆయన ఎంపిగా పోటీ చేస్తారా, ఎమ్మెల్యేగా రంగంలో ఉంటారా అనేది ప్రశ్నార్థకంగా ఉంది. అరుకు ఎంపి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆయన గతంలో అనేక సందర్భాల్లో అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నుంచి డిప్యూటీ సిఎం వరకు కీలకమైన పదవులు అలంకరించారు. ఐదోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా, మొదటి సారి ఎంపీగా రంగంలోకి దిగుతారా అనేది వైసిపి అధిస్థానం నిర్ణయంపై ఆధారపడి ఉంది. సీనియర్ గిరిజన ఎమ్మెల్యేగా పార్టీ నాయకత్వం ఆయన సేవలను ఏదో ఒక విధంగా వినియోగించుకునే అవకాశం ఉంది. ప్రస్తుత అరుకు ఎంపి జి.మాధవి రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ హైకమాండ్ కూడా ఆమెను అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆమె సామాజిక వర్గం అసెంబ్లీ బలంగా వున్న నియోజకవర్గం నుంచి పోటీ చేయించే యోచనలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎంపిగా పోటీ చేయడానికి రాజన్నదొరతో పాటు జిసిసి చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి కూడా ఆసక్తి చూపుతున్నారు. రాజన్నదొర ఏ విధంగా ఎంపి కైనా ఎమ్మెల్యే కైనా పోటీకి సిద్ధంగా ఉన్నారో జిసిసి చైర్‌పర్సన్ స్వాతిరాణి కూడా అదే తరహాలో ఎదురు చూస్తున్నారు. అరుకు ఎంపి స్థానం నుంచి పోటీ చేయాలని స్వాతిరాణీ కూడా భావిస్తున్నారు. పార్టీ అధిస్థానం ఏ స్థానం నుంచి పోటీ చేయాలని కోరినా చేయడానికి ఆమె సంసిద్ధత కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ రాజన్నదొర ఎంపీగా పోటీ చేస్తే సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీకి సిద్ధమేనన్న సంకేతాలను ఆమె పంపుతున్నారు. స్వాతీరాణి భర్త గుల్లిపిల్లి గణేష్ తన సొంత నియోజకవర్గం సాలూరు కావడంతో ఆయనకు కొంత పలుకుబడి వుంది. నియోజకవర్గంలో ఒక ప్రధాన సామాజిక వర్గానికి చెందిన నాయకుడు గణేష్ కావడం, స్వాతిరాణి గతంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పని చేయడంతో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అరుకు ఎంపి, లేదా సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచైనా పోటీ చేయడానికి స్వాతిరాణి ఆసక్తి చూపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు కూడా పార్వతీపురం మన్యం జిల్లా కి చెందిన నాయకులే. ఆయన గతంలో టిడిపి ఎంపిగా పని చేశారు. ఆ తర్వాత కొన్నాళ్ల పాటు క్రియాశీల రాజకీయాలకు దూరంగా వుంటూ వచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలో చేరారు. పార్వతీపురం ఎంపీగా ఒకసారి విజయం సాధించడంతో ఆయనకూ ఈ జిల్లా రాజకీయాలతో సంబంధం వుంది. అయితే ఆయన పేరును కూడా ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటుందనేది ప్రశ్నార్థకంగా ఉంది. అధికారపార్టీ తరపున ఎవరు ఏ స్థానం నుంచి పోటీ చేస్తారనేది ఆయా నేతల రాజకీయ అనుభవం, క్రియాశీల రాజకీయాల్లో పోషిస్తున్న పాత్ర, సామాజిక కోణం వంటి అంశాలపై ఆధారపడి ఉంది. పార్టీ అంతర్గత సర్వేల్లో అనుకూల, ప్రతికూల అంశాలనూ అధిస్థానం పరిగణనలోకి తీసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

తిత్తిరిలో ఏనుగు ధ్వంసం చేసిన అరటిపంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఏనుగుల బారి నుంచి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఏనుగులతో పంటలు, ఇళ్లు నష్టపోయిన గిరిజనులను ఆదుకొని వాటి బారి నుంచి గిరిజనులకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో తిత్తిరి పంచాయతీలో పలు గిరిజన గ్రామాల్లో ఏనుగుల వల్ల పంట నష్టపోయిన బాధితులు హెచ్.నాగేశ్వరరావు, అడ్డాయి, గోవిందాతో కలిసి ధ్వంసమైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా ఏనుగులు 12 గిరిజన గ్రామాల్లో తిష్ట వేసి పంటలను ధ్వంసం చేస్తూ ఇళ్లను కూలదోస్తూ విధ్వంసం సృష్టిస్తుంటే అధికారులు ఒక్కసారి కూడా పర్యటించి, పంట నష్టాలను పరిశీలించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గంటె, రాగులు, వరి, అల్లం, పసుపు పంటలను మొత్తం ధ్వంసం చేశాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంట నష్టం పరిహారం గిరిజనులకు ఇచ్చి ఏనుగులను దూర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎం.నాగేశ్వరరావు, తెంబు, తిరుపతిరావు, సారంగా తదితరులు పాల్గొన్నారు.

భయాందోళనలో గొట్టివలసవాసులు

గరుగుబిల్లి : మండలంలోని గొట్టివలస పరిధిలో ఏనుగులు సంచరించడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అరచేతిలో ప్రాణం పెట్టుకుని గత రెండు రోజులుగా ఆ గ్రామస్తులు ఉంటున్నారు. సంబంధిత అధికారులు ఎందుకు వీటిని అడవులకు తరలించట్లేదని ప్రశ్నిస్తున్నారు. ఏనుగుల వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు జరుగుతున్నా వీటిని తరలించే విషయంలో చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఏనుగులను అటవీ ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్ఒబి పూర్తయ్యేదెప్పుడు?

- అసంపూర్తిగా పెదమానాపురం రైల్వే వంతెన పనులు
- పెరిగిన వాహన రాకపోకలు
- మునుపెన్నడూ లేని విధంగా ట్రాఫిక్ జామ్
- ప్రయాణికులు, స్థానికులకు తీవ్ర అవస్థలు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ఉమ్మడి జిల్లాల్లో అత్యంత రద్దీ మార్గంలోని పెదమానాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి అర్థాంతరంగా నిలిచిపోయింది. పదేళ్లుగా పూర్తికాని వంతెనగా ఇది రికార్డులకెక్కింది. ఉమ్మడి జిల్లాల వాసుల్లో ప్రతిఒక్కరి నోటా ఇదే మాట. ఫలితంగా అటు వాహనదారులు, ఇటు ప్రయాణికులు, మరోవైపు స్థానికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అసంపూర్తి నిర్మాణ పనులతో అవస్థలు పడుతున్నారు. 26వ నెంబరు జాతీయ రహదారి కావడంతో ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో వాహన చోదకులు నానాపాట్లు పాడుతున్నారు. నిర్మాణ పనులు ఎక్కడివక్కడ వదిలేయడంతో రోడ్డంతా గుంతలమయమై ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

అర్థాంతరంగా నిలిచిన రైల్వే వంతెన

విజయనగరం నుంచి రామభద్రపురం, బొబ్బిలి, పార్వతీపురం మీదుగా రాయగడ, ఇటు సాలూరు, సుంకి మీదుగా ఒడిశా వెళ్లే 26వ నెంబరు జాతీయ రహదారి ఇది. అందుకే నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అంతటి ప్రధానమైన 26వ నంబర్ జాతీయ రహదారిలో పెదమానాపురం వద్దనున్న రైల్వేగేటుతో నిత్యం వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతుండటంతో 2013లో ఫ్లైఓవర్ పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు పదేళ్లు పూర్తికావస్తున్నా ఆర్ఒబి నిర్మాణం పూర్తికాలేదు. ఇప్పటివరకు రైల్వేట్రాక్‌కి ఇరువైపులా నాలుగు పిల్లర్లు మాత్రమే నిర్మించారు. మొత్తం బ్రిడ్జి పూర్తవడానికి పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణంతో పాటు ఓవర్‌బ్రిడ్జిని నిర్మించాలి. కానీ ఇంతవరకు అటువంటి చర్యలు తీసుకోలేదు. పర్యావసానం ప్రయాణికులు, వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గతేడాది జనవరిలో రోడ్డు విస్తరణ కోసం నిర్వాసితులకు పరిహారం అందజేసి, ఖాళీ చేయించి చకచకా పనులు ప్రారంభమైనా మూడు అడుగుల ముందుకు.. ఆరడుగుల వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా కాలువలు పూర్తిచేసి, డైవర్షన్ రోడ్లు వేసేందుకు పనులు చేపట్టి అర్థాంతరంగా నిలిపేశారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డు కావడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డైవర్షన్ రోడ్డులో గోతులు ఏర్పడటంతో వాహనాలు ఎప్పటికప్పుడు నిలిచిపోతున్నాయి.

అందరికీ పాట్లే

మానాపురం గేటు పడితే వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాల్సి వస్తోంది. ఒక్కోసారి రెండు, మూడు రైళ్లు వెళ్లే వరకూ గేటు తీసే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఎండవేడిని తట్టుకోలేక వాహనదారులు, బస్సుల్లో వృద్ధులు, చిన్నారులతో ప్రయాణించేవారు తీవ్ర ఆందోళనకు చెందుతున్నారు.. పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో రోడ్డుపై దుమ్ము, ధూళితో స్థానికులు కూడా తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రతి పది నిమిషాలకు రైల్వే గేట్ పడటంతో స్థానిక పోలీసులు ఎండలోనే ఉండి ట్రాఫిక్ మళ్లించేందుకు చర్యలు చేపట్టాల్సి వస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణం నిత్యం నరకప్రాయంగా ఉందని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఫ్లైఓవర్ పనులు చేపట్టేలా చర్యలు చేపట్టి, ప్రయాణికుల కష్టాలకు విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మరిపల్లిలో ప్రచారం చేస్తున్న జగదీశ్వరి

టిడిపితో గిరిజనాభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

చంద్రబాబుతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. మండలంలోని మరిపల్లిలో ఆదివారం బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబునాయుడుకు అక్రమంగా, కక్షపూరితంగా వైసిపి ప్రభుత్వం అరెస్టు చేసిందని, ఆయనకు అండగా మనమంతా ఉండి రానున్న ఎన్నికల్లో చంద్రబాబునే గెలిపించుకోవాలని, అప్పుడే మన గిరిజనులు అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కెవి కొండయ్య, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్, జిల్లా కో ఆప్షన్ మాజీ సభ్యులు రంజిత్ కుమార్, నాయకులు వెంపటాపు భారతి, గవరయ్య, గౌరి, బి.యువరాజు, వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచులు సుక్కు, హెచ్.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

సాలూరు: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు వైసిపి ప్రభుత్వం కుట్రపూరిత చర్య అని నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి అన్నారు. పట్టణంలో చినహరిజనపేటలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపికి ప్రజల్లో ఆదరణ పెరుగుతున్న తీరు చూసి వైసిపి ప్రభుత్వం అక్రమంగా చంద్రబాబునాయుడును స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఇరికించిందని చెప్పారు. సిఎం జగన్ అరాచక పాలన గురించి ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఎఎంసి మాజీ చైర్మన్ కేతిరెడ్డి చంద్రశేఖర్, పట్టణ నాయకులు నల్ల అర్జున్ రావు పాల్గొన్నారు.

ఇదెక్కడి న్యాయం?

పేదలపై ప్రతాపమా?

భూముల స్వాధీనంపై గొట్టువలస పేదల ఆవేదన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో గొట్టువలస రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబర్ 272, 273, 274 నెంబర్లలో నిరుపేద రైతులకు ప్రభుత్వం 2008లో డి-పట్టాలు అప్పటి ప్రభుత్వం ఇచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు రైతులు ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అలాంటి ఆధారమైన భూమిని లాక్కొని పేదలను నడిరోడ్డున పడేలా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పేదల భూములను అటవీశాఖకు అప్పగించాలనే రెవెన్యూ అధికారుల తొందరపాటు నిర్ణయంతో తప్పు మీద తప్పు చేస్తూ ఉన్నారు. పేదల పక్షాన నిలబడాల్సిన అధికారులు నిర్దాక్షిణ్యంగా ఒంటెద్దు పోకడల మాదిరిగా ప్రవర్తించడం మండల ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అటవీశాఖ భూమి విషయంలో మండల రెవెన్యూ అధికారులు బలవంతంగా రైతుల నుంచి భూములు తమ ఆధీనంలోకి తీసుకోవాలనే ఉద్దేశంతో బెదిరింపు చర్యలు చేపడుతున్నారని, ఇదేమని బాధితులు ప్రశ్నిస్తే మీ రేషన్ కార్డ్, పెన్షన్లు అలాగే ప్రభుత్వ పథకాలేవీ లేకుండా చేస్తామని అధికారులు జులుం ప్రదర్శిస్తున్నారు. అలాగే ఇదే కొండ ప్రాంతంలో మైనింగ్‌కు ఇచ్చిన 45 ఎకరాలను అధికారులు ఎందుకు అటవీశాఖకు బదలాయించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు అటవీ శాఖకు ఇచ్చిన 279 సర్వే నెంబరు భూమి ఎక్కడుందో అధికారులు తెలపాలని, అధికారులు చూపించిన 279 భూమిని మాత్రమే అటవీ శాఖకు అప్పగించాల్సి ఉండగా, తమ డి-పట్టాలు ఇచ్చిన భూములపై అధికారులు పట్టుపట్టి లాక్కోవడం ఇదెక్కడ న్యాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మా కన్నీళ్లకు కారణం అధికారులే

మా పిల్లాపాపలను వదిలి రాత్రింబవళ్లు అనకుండా, రాయరప్పను తీసివేసి చదును చేసి సాగు చేశాం. మా జీవనాధారానికై పలు చెట్లను వేసుకుని తల్లిలా చూసుకుంటున్నాం. ఇలాంటి తమ భూమిని అధికారులు లాక్కొని మ కన్నీళ్లకు కారణవుతున్నారు. కష్టజీవులపై కనికరం లేని అధికారుల తీరు తమ కుటుంబాల్లో కన్నీరు మిగిల్చేలా వ్యవహరించడం సరికాదని బాధిత రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా భూములను మాకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని పేదలు కోరుతున్నారు.

పాలకొండ ఆర్‌డిఒగా లావణ్య

ప్రజాశక్తి- పార్వతీపురం

పాలకొండ రెవెన్యూ డివిజన్ అధికారి ఎం.లావణ్య నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 83మంది డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలయ్యాయి. అందులో భాగంగా విజయనగరం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం.లావణ్యకు పాలకొండ ఆర్‌డిఒగా బదిలీ అయ్యింది. ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన నూరుల్‌కమర్ రెండునెలలు క్రితం బదిలీ అయ్యారు. ఇదిలా ఉండగా పార్వతీపురం కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టర్లుగా కె.గీతాంజలి, జి.కేశవనాయుడు నియమితులయ్యారు. వీరిలో గీతాంజలి పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి రాగా, అనంతపురం జిల్లా సెట్విజ్ సిఇఒగా పనిచేస్తున్న కేశవరావు ఇక్కడకు బదిలీపై వస్తున్నారు.

400 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

ఒడిషా నుండి పార్వతీపురం మండలం రంగాల గూడ గ్రామానికి కూలీలతో తరలిస్తున్న 400 నాటుసారా స్వాధీనం చేసుకున్నట్టు ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ యల్. ఉపేంద్ర తెలిపారు. ఇందుకు సంబంధించి కద్రక బంటి, పీడిక సోమన్నపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య సిబ్బందిని నియమించాలి

టిడిపి అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో గల ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని నియమించి విద్యార్థులకు స్థానికంగా మెరుగైన వైద్యం అందించాలని టిడిపి అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులకు స్థానికంగా వైద్యసేవలు కరువవుతున్నాయని తెలిపారు. వైద్యం కోసం మండల కేంద్రాల్లో ఉన్న ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇటు చదువుకు దూరమై అటు ఆరోగ్యం క్షీణించి విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రతి ఏటా పదుల సంఖ్యలో మరణాలు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నియమించిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని వైసిపి ప్రభుత్వం తొలగించడంతో విద్యార్థులకు సేవలు అందని ద్రాక్షగా మారిందన్నారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మినరల్ వాటర్ అందుబాటులో ఉంచాలని, ప్రహరీలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఒపిఎస్ అమలు చేయాల్సిందేలి

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోరుతున్న పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కృష్ణబాబు కోరారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులకు ఏం హామీ ఇచ్చారు, ఏం అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇదేనా మాట తప్పను, మడమ తిప్పను అంటే అని విమర్శించారు. ఒపిఎస్ అమలు చేయకుంటే మడమ తిప్పినట్టేనన్నారు. యుటిఎఫ్ చేపడుతున్న పోరాటాలకు టిడిపి సంపూర్ణ మద్దతు తెలుపుతుందని అన్నారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న జెసి గోవిందరావు దంపతులు

కోటదుర్గమ్మను దర్శించుకున్న జెసి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో కోటదుర్గమ్మ వారిని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి మురళీకృష్ణ జెసికి అతిథి మర్యాదలతో ఆహ్వానించారు. ఆలయ ప్రధాన అర్చకులు దారాలపుడి లక్ష్మీప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను ఆయన వివరించారు.

కేదారిపురంలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురంలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించడంలేదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం తాడికొండ, గుమ్మలక్ష్మీపురం వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఇక్కడ పిహెచ్‌సి ఏర్పాటు చేస్తే వంగర, కేదారిపురం, దుమ్మంగి, రెల్ల, సొండ్రుకోన పంచాయతీల్లో వందలాది మంది గిరిజనులకు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

గిరిజన గ్రామాల్లో 'గ్రామదర్శిని'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పులిపుట్టి, కె.గుమడ, రేగులగూడ, జామితోట, హడ్డుబంగి తదితర గిరిజన గ్రామాల్లో మన్య ప్రగతి ఆధ్వర్యంలో మన్య ప్రగతి చైర్మన్ గేదెల రవి ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు. సంస్కృతి - సంప్రదాయాలు, గ్రామాల అభివృద్ధి - మానవ సంబంధాలు పై 'గ్రామ దర్శిని - ప్రజా చైతన్య అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి చైతన్యం చేస్తున్నారు. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది - మహాత్మా గాంధీ స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని చెప్పారు. ఈ మేరకు పులి పుట్టి గ్రామంలో ముకిడి పోలమ్మ దసరా ఉత్సవాలు సందర్భంగా పులిపుట్టి, కొత్తూరు - గుమడ, రేగుల గూడ, జామి తోట, బిల్లు మాడ హడ్డుబంగి గ్రామ ప్రజలు, టిడిపి మండల అధ్యక్షుడు సవర తోట ముఖలింగం, టిడిపి సీనియర్ నాయకులు మహిళలతో కలిసి ముక్కిడి పోలమ్మ గుడి వద్ద అమ్మవారి ఘటాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో పర్యటిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

తామరఖండి, లక్ష్మీపురంలో టిడ్కో చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని తామరఖండి, లక్ష్మీపురం గ్రామాల్లో దేవీ నవరాత్రులు సందర్భంగా ఆదివారం జరిగిన పూజలను, అన్న సంతర్పణ కార్యక్రమాల్లో రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ సందర్శించారు. అమ్మవారిని ఆయన దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పెదబోగిలి మాజీ సర్పంచ్ అరవింద్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల ర్యాలీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కొమరం భీమ్ జయంతి సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం, ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు అమర్నాథ్, సూర్యనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిఒ 3 అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

దీక్షల భగ్నంతో ఉద్యమాలు ఆగవు

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల వద్ద యుటిఎఫ్ నాయకులు చేస్తున్న నిరవధిక నిరాహారదీక్షలను పోలీసులు భగ్నం చేయడం వల్ల ఉద్యమాలు ఆగిపోవని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ అన్నారు. పోలీసులచే ప్రభుత్వం యుటిఎఫ్ నాయకుల దీక్షలు భగ్నం చేయించడం పట్ల ఆయన స్పందించారు. నిరవధిక దీక్ష శిబిరాలు వద్దకు అధికారులు వచ్చి కనీసం యుటిఎఫ్ నాయకులతో మాట్లాడడం, సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం విచారకరమని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించని పక్షంలో మరిన్ని పోరాటాలు ఉధృతంగా జరుగుతాయని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రెండు నేత్రాలు లాంటివని అన్నారు. కాబట్టి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వాలకు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకుల సందడి చేశారు. దసరా సెలవులు రావడం, అందులో ఆదివారం సెలవు కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులతో పార్కు పోటెత్తింది. పార్క్‌లోని అందాలను ఆశ్వాదించారు. జల విహార వద్ద యువకులు బోటు షికారు చేశారు. హ్యాకింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. స్కై సైకిల్‌తో ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి పార్కుచుట్టూ చక్కెర్లు కొట్టారు. కమాండ్ ఎక్కి ఆడుకున్నారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడారు.

ఘనంగా మహా సుదర్శన సహిత చండీ హోమం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ శివారులో గల సూర్యపీఠంలో ఆదివారం మహాష్టమి సందర్భంగా పీఠం నిర్వాహకులు బ్రహ్మశ్రీ వేమకోటి నరహర శాస్త్రి ఆధ్వర్యంలో మహాసుదర్శన సహిత చండీ హెూమం నిర్వహించారు. అనంతరం సకలదేవతా మంత్ర హవనం చేసి, ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, సౌర అరుణ పారాయణాలు, నవదుర్గా పూజ నిర్వహించారు. యాగ పూర్ణాహుతి అనంతరం నారాయణ సేవ చేశారు. అనంతరం నరహరి శాస్త్రి మాట్లాడుతూ, విశ్వశాంతి మంత్ర హోమం లోక కల్యాణార్థం, సకాల వర్ష ప్రాప్తికి ప్రజల ఆరోగ్య సిద్ధికి, ప్రపంచమునందు నేడు నెలకొన్న యుద్ధ వాతావరణ ఉపశమనానికి, ప్రజల శాంతిమయ జీవనానికై పై కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్, వేమకోటి శశిభూషణ శర్మ , టి.ఆర్. కష్ణ శర్మ వైదిక సహకారం అందించారు.

చండీహోమం చేస్తున్న నరహరశాస్త్రి

గడగమ్మలో అన్నీ సమస్యలే

- సాగు, తాగునీటికి తీవ్ర అవస్థలు
- రెండు నెలలు గడుస్తున్నా అందని సాగునీరు
- ప్రకటనలకే పరిమితమవుతున్న అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రానికి కూత వేట దూరాన ఉంది గడగమ్మ గ్రామం. అయినా ఈ గ్రామ అభివృద్ధిపై ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు దృష్టి సారించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. ఈ గ్రామంలో 270 కుటుంబాలు దాదాపుగా 930 మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామంలో సుమారు పది మంచినీటి బోరు బావులు ఉన్నాయి. అయితే ఈ నీటు తాగేందుకు ఉపయోగపడకపోవడంతో గ్రామస్తులు నాగావళి నదిని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్క తాగునీరే కాదు సాగునీటి సమస్య గ్రామంలో మౌలిక వసతులు కొరత వేధిస్తుంది.

అన్ని కాలాల్లో నది దిక్కు

గ్రామంలో బోరుబావులు ఉన్నప్పటికీ తాగేందుకు పనికిరావు. కేవలం ఇతరత్రా అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి సమీపాన నాగావళి నది వద్దకు ఎండైనా, వానైనా అక్కడికి వెళ్లి చలమల ద్వారా నీరు తోడుకుని తీసుకొచ్చి దాహార్తి తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు తాగడం వల్ల వ్యాధుల బారిన పడి వేలాది రూపాయలు వెచ్చించి ఆరోగ్యం నయం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఈ గ్రామంలో 133 ఎకరాల పల్లం, 168 ఎకరాల మెట్టు, ఇతరత్రా కలిపి 417 ఎకరాల భూమి సాగులో ఉన్నట్లు రెవెన్యూ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గ్రామానికి తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ మొదటి ఛానల్ నుంచి నడిమికెల్ల, విక్రంపురం, కిమ్మి, చిట్టిపుడివలస, కొట్టుగుమ్మడ గ్రామాలు దాటి తమ గ్రామానికి సాగునీరు రావాల్సి ఉంది. సర్దార్ గౌతు లచ్చన్న రిజర్వాయర్ నుంచి ఈ ఏడాది జులై 20న నీటిపారుదల శాఖ అధికారులు సాగునీరు విడిచిపెట్టారు. దాదాపు రెండు నెలలు కావస్తున్నప్పటికీ గ్రామంలో పంట పొలాలకు సాగునీరు రాకపోవడంతో బోరు సదుపాయం ఉన్న వారు పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏ అవకాశం లేని వారు వరుణుడిపై ఆశలు పెట్టుకొని పంటలు సాగు చేస్తున్నారు.

రాళ్లు తేలిన గడగమ్మ రహదారి

రేకుల షెడ్డులో వంటలు

గ్రామంలో మండల ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 51మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవల నాడు-నేడు కింద పాఠశాల అభివృద్ధి పనులు జరిగినప్పటికి వంటశాలపై దృష్టి సారించకపోవడంతో వర్షం పడినా అందులోనే వంటలు చేసి విద్యార్థులకు భోజనాలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మధ్యాహ్నభోజన నిర్వాహకులు వాపోతున్నారు. శిథిలావస్థలో ఉన్న ఈ రేకుల షెడ్డు ఎప్పుడు కూలిపోతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ అందులోనే వంటలు చేస్తున్నట్లు నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు.

అధ్వాన రహదారితో అవస్థలు

గ్రామానికి వెళ్లే బిటి రహదారి అధ్వాన్నంగా ఉండడం వల్ల రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఈ రహదారి ఎక్కడిక్కడ రాళ్లు తేలిపోవడంతో తరచూగా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరేళ్ల కిందట రూ.36లక్షల అంచనా వ్యయంతో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. పనులు చేపట్టినప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రహదారి ఎక్కడికక్కడ రాళ్లు తేలి దర్శనమిస్తుంది. మూడు కాలాలు ఉండాల్సిన రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కాలం చెల్లక ముందే రహదారులు అధ్వాన్న స్థితికి చేరుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నది నుండి నీరు తెస్తున్న మహిళలు

ఘనంగా కోటకొండ దుర్గమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ పంచాయతీలో గల కోటకొండ గిరి శిఖర గిరిజన గ్రామంలో వెలిసిన కోటకొండ దుర్గమ్మను ప్రతి ఏటా దసరాకు మూడు రోజులు ముందుగా భామిని, కురుపాం మండలాల నుంచి పెద్దసంఖ్యలో దుర్గమ్మను దర్శించుకుంటారు. ఈ దుర్గమ్మను దర్శించుకోవాలంటే జి.శివడ నుండి సుమారు 8కిలోమీటర్ల దూరం కొండ ఎక్కి దర్శించుకోవాలి. కోటకొండ దుర్గమ్మకు దసరాకు మూడు రోజులు ముందుగా పడినటువంటి ఆదివారము నాడు దర్శించుకుంటారు. ఈ దుర్గమ్మ దసరా నవరాత్రులు పూజలను అందుకుంటుంది. ఆదివారం ఉదయం నుండి ఈ రెండు మండలాల నుండి భక్తులు తండోపతండాలుగా వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు.

భామిని : పర్లాకిమిడి రాజులచే మోకాశ దొరలుగా గతంలో పిలువబడిన భామిని గ్రామ కీర్తి రాయి వంశస్తులు ప్రతి ఏటా విజయదశమి ముందుగా వచ్చే ఆదివారం దసరా పండుగ నిర్వహిస్తారు. కీర్తిరాయి వంశస్తులు స్వతహాగా గిరిజన వంశస్తులు కావడంతో గిరిజన సంప్రదాయాలతో కీర్తిరాయి వంశస్తులు కుల దైవమైన కోటకొండ దుర్గమ్మ వెలసిన స్థలానికి వెళ్లి ఆదివారం మొక్కులు చెల్లిస్తారు. కార్యక్రమం లో భాగంగా ఈ ఏడాది కీర్తి రాయి క్రిష్ణ చంద్రదొర కుమారుడు నవీన్ చంద్రదొర శనివారం గ్రామస్తులు, గిరిజన కుటుంబాలతో కలిసి డప్పు వాయిద్యాలతో వంశధార నదికి వెళ్లి ఆయుధాలు శుభ్రం చేసి, ఇంటి వద్ద వున్న పూజమందిరం వాటిని అలకరించి పూజలు నిర్వహించారు. ఆదివారం నవీన్ చంద్ర దొర గిరిజన దొర వేషధారణలో డప్పు

కోటదుర్గమ్మ గుడికి పోటెత్తిన యాత్రికులు

భామిని కీర్తిరాయి నవీన్‌చంద్రదొరను ఊరేగిస్తున్న గ్రామస్తులు

వాయిద్యాల మధ్య ఊరేగింపుగా గుర్రం పై వెళ్లి దుర్గమ్మకు మొక్కులు చెల్లించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు పత్తిరి కొమ్మలను దొర పూజ కార్యక్రమంలో ఉంచి, వాటిని వ్యవసాయం పొలంలో జల్లితే పంటలు సమృద్ధిగా పండుతాయని నమ్మకం. ఈ దసరా ఉత్సవాలను తిలకించడానికి వచ్చిన పరిసర గ్రామ ప్రజలతోకిట కిట లాడింది.

ఘటాలు ఊరేగింపు

గుమ్మలక్ష్మీపురం : ప్రతి ఏటా దసరా పండుగ సందర్భంగా గుమ్మలక్ష్మీపురం నుంచి మాలతమ్మతల్లి గుడి వరకు భక్తులు 15 కిలోమీటర్లు ఘటాలు ఊరేగింపుగా వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగానే ఆదివారం ఉదయం గుమ్మలక్ష్మీపురం నుంచి మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాలజంగడి, ఘటాలను మాలతమ్మ గుడి వరకు ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచి బి.గౌరీశంకర్రావు, దోస్త్ మేరా దోస్త్ సభ్యులు పాల్గొన్నారు.

మాలతమ్మ గుడి దసరా ఏర్పాట్లు పరిశీలన

కురుపాం : మండలంలోని నేరేడువలస గల మాలతమ్మ గుడి వద్ద జరగనున్న విజయదశమి వేడుకల ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ పరిశీలించారు. క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్వచ్చంధంగా సేవ చేస్తున్న యువతకు భక్తుల రద్దీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై సిహెచ్ ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు .

సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి కొమరాడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టేలా చేపడుతున్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం గుమడ సంతలో సిపిఎం ఆధ్వర్యంలో యాత్ర సంబంధించి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 30, 31 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా రక్షణ బేరి బస్సు యాత్ర జరుగుతుందని, వీటిని జయప్రదం చేయాలని సాంబమూర్తి కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేస్తూ ఈ సమస్యలపై ఈ ప్రజా రక్షణభేరి బస్సుయాత్ర ఈనెల 30న కురుపాంకు చేరుకుంటుందన్నారు. కావున ఈ బహిరంగ సభకు ప్రజానీకమంతా రావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉపేంద్ర, లక్ష్మీనాయుడుతో పాటు గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

25న రేగులపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడులో ఈనెల25నన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. రేగులపాడు గ్రామస్తులతో పాటు గ్రామానికి అనుసంధానమైన ప్రజలు వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

1న వైసిపి బస్సు యాత్ర

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నవంబర్ 1న జరిగే సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. మండలంలోని అడ్డాపుశిల సచివాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్సు యాత్ర సన్నాహక సమావేశాల్లో భాగంగా సోమవారం పార్వతీపురంలో జరిగే సమావేశంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్లు బొత్స సత్యనారాయణ, వై.వి సుబ్బారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు ఎంపిటిసిలు, సర్పంచులు, గృహ సారథులు, కార్యకర్తలు, వాలంటీర్లు తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సచివాలయం నూతన భవనం నిర్మాణం విషయమై ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమవారం తహశీల్దార్ గ్రామానికి విచ్చేసి స్థలం చూపించి భవన నిర్మాణం కొరకు క్లియర్ చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, వైస్ ఎంపిపి బి.రవికుమార్,

అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నాయకులు బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, ఆయా గ్రామాల సర్పంచ్లు పెండ రమణ, రామకృష్ణ, ఎంపీటీసీ ఎస్.కృష్ణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లోకి మురుగు నీరు

ప్రజాశక్తి -భామిని

గ్రామంలోని నాయుడు వీధిలోని మురుగు కాలువలు పాడై ఆ నీరంతా వీధుల్లో ప్రవహిస్తోంది. గ్రామానికి అధికారులెవరైనా వచ్చినప్పుడు మురుగు తీసి, కాలువలు శుభ్రం చేయడం తప్ప మిగతా సమయాల్లో శుభ్రం చేయడంలేదని ఆ వీధి వాసులు వాపోతున్నారు. ఇంటి ముందు మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉండడంతో దోమలకు నిలయాలుగా మారుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. బయటకు వెళ్లాలంటే మురుగు నీరు మీదుగానే రాకపోకలు సాగించాల్సి వస్తోందంటున్నారు. అలాగే ఈ వీధిలోని బోరు అనేక రోజుల క్రితం మరమ్మతులకు గురైన పట్టించుకోవడం లేదని వీధివాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మరుగుకాలువలను, బోరును మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

అధిక లోడుతో ఒడిశా ఇసుక లారీలు

ప్రజాశక్తి - భామిని

ఒడిశా నుంచి బత్తిలి మీదుగా బత్తిలి -అలికం రోడ్డు వెంబడి ఆంధ్రాలోని విజయనగరం, విశాఖపట్నం వైపుగా అధిక లోడ్‌తో ఇసుక లారీలు రాత్రులు వేగవంతంగా దుమ్ము దూలితో ప్రయాణిస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే ఒడిశాలోని రాయగడ జిల్లా, పద్మపూర్ బ్లాక్ లోని గుమడ వంశదార నది వద్ద బిసంకోటక్ శాండ్ బెడ్ నుంచి ప్రతి రోజు రాత్రులు అధిక సంఖ్యలో ఇసుకు లారీలు 40 టన్నులు లోడ్‌తో బత్తిలి - అలికాం రోడ్డు మీదుగా అతివేగంగా ప్రయాణిస్తున్నాయి. ఆంధ్రా కంటే ఒడిశాలో ఇసుక సంబంధిత నిబంధనలు సరళంగా ఉండడం, ఇసుక రేటు తక్కువగా ఉండడం, డబ్బులు చెల్లించే దాని కన్నా అధికంగా ఇసుక లోడ్ చేసుకునే వెసులుబాటు ఉండటం, ఆంధ్రాలో అంత ఇసుక వేసుకునే వెసులు బాటు లేకపోవటంతో ఒడిశా నుంచి ఇసుక రవాణాకు మొగ్గుచూపుతున్నారు. వాస్తవానికి ఒడిశా నుండి వచ్చే ఇసుక లారీల బిల్లులు చూస్తే 30 టన్నులకే వే బిల్లు, అమౌంట్ రిసీట్ ఉంటుంది. కానీ వాస్తవానికి ఒక లారీ 40 టన్నులతో నిబంధనలకు విరుద్దంగా ఆంధ్రాలోకి వస్తాయి. బత్తిలి నుండి కొత్తూరు మధ్య బత్తిలి -అలికాం ప్రధాన రహదారి రోడ్డు గోతుల మయంగా, కూలిపోయే వంతెనలతో ఉన్న ఈ రోడ్డుపై 40 టన్నులు ఇసుక లారీలు అధిక సంఖ్యలో వస్తుండడంతో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉందని, రోడ్డు, వంతెనలను పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేయకుండా గాలికొదిలేసిన అధికారులు భవిష్యత్తులో ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని

పొంచి ఉన్న ప్రమాదం

అధిక లోడుతో వెళ్తున్న ఒడిశాకు చెందిన లారీ

స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా ఒడిశా నుండి అధిక లోడ్‌తో వస్తున్న ఇసుక లారీతో ప్రమాద పొంచి వుందని సూచించారు. రోడ్డు, వంతెనలు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసే వరకు అధిక లోడ్‌తో వస్తున్న వాహనాలను అధికారులు నిలిపివేయాలని పలువురు కోరుతున్నారు.



సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుపతిరావు

అంటిపేట సర్పంచిగా తిరుపతిరావు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేట సర్పంచ్‌గా బొంగు తిరుపతిరావు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో సర్పంచిగా పనిచేసిన సిరికి మహేష్‌కు 1998 డిఎస్‌సి ఉపాధ్యాయునిగా ఎంపిక కావడంతో ఆయన సర్పంచి పదవికి రాజీనామా చేశారు. దీంతో ఇంతవరకు ఉప సర్పంచిగా ఉన్న తిరుపతిరావుకు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టి గ్రామ అభివృద్ధికి అన్ని వేళలా కృషి చేస్తానని చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. తనకు ఈ పదవి రావడానికి కారకులైన ఎమ్మెల్యే జోగారావుకు, మండల స్థాయి ప్రజాప్రతినిధులకు, నాయకులకు, అధికారులకు, అంటిపేట గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను అంటిపేట గ్రామ పెద్దలు, శ్రేయోభిలాషులు, వెన్నెలబుచ్చెమ్మపేట గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కొత్తగా సర్పంచిగా బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ బొంగు తిరుపతిరావును ఎమ్మెల్యే జోగారావు, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, గ్రామపెద్దలు అంబటి కృష్ణంనాయుడు, శనపతి తిరుపతిరావు, వెలమల దానబాబు, సిరికి మహేష్, శనపతి నిర్మల, తెంటు శంకరరావు, వెన్నెల నాగభూషణరావు, వెన్నెల నర్సం నాయుడు, సిరికి శ్రీనివాసరావు, మూడడ్ల వేణుగోపాలస్వామి తదితరులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, అంటిపేట, వెన్నెల బుచ్చెమ్మపేట, వెంకటాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

వరుణుడి కోసం పూజలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో వరి పంట కీలక దశలో ఉన్న సమయంలో వర్షాలు కురవక పోవడంతో రైతులు వరుణ దేవుడు కరుణ కోరుతూ పలు గ్రామాలలో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పార్వతీపురం మండలం సంగం వలస గ్రామానికి చెందిన రైతులు ములగ పంచాయితీలో ఉన్న బడిదేవర కొండపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనవాయితీగా వస్తున్న వరద పాయసాన్ని కొండపై పోశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో వర్షాలు కురవకపోతే ఈ ఏడాది వరి పంటపై ఆశ వదులుకోవడమేనని అన్నారు. కార్యక్రమాలలో సంగంవలస, గదబవలస, కోరి గంగాపురం గ్రామాల నుంచి రైతులు పాల్గొన్నారు.

పైడి తెగ సంక్షేమ సంఘం అధ్యక్షులు మృతి

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బత్తిలికి చెందిన పాలక రాజారావు (71) విశాఖలోని తన స్వగృహంలో గుండె పోటుతో ఆదివారం మృతి చెందారు. ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తరాంధ్ర పైడితెగ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా, పైడి కులస్థులు సంక్షేమం కోసం రెండు దశాబ్దాల పాటు విశేష కృషి చేశారు. ఆయన గతంలో ఆలిండియా రేడియో డిడిజెగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు భార్య ప్రమీలా గాంధీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ప్రస్తుతం విశాఖపట్నం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో పైడి సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.